

# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

### కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో
### అలనాటి అందమైన నవల పునర్ముద్రణ

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**ప్రేక్షకుల్నుంచి** హడావుడి బయల్దేరింది. అంతా అల్లకల్లోలమైపోయింది. కొంతమంది విద్యార్థినులు గబగబా స్టేజి మీదకు వచ్చి రాజ్యలక్ష్మిని పడిపోకుండా పట్టుకున్నారు. మధుబాబులో ఆవేశం పొంగులు వారింది. క్రిందకు దూకి బయటకు పరిగెత్తాడు.

ఈ ఘనకార్యం చేసినవాడికి యింత కల్లోలం చెలరేగేసరికి గుండె బేజారైపోయింది. అటూయిటూ చూసి ప్రక్కనున్న చెలికానితో కాలికి బుద్ధి చెప్పాడు.

వాళ్ళను మధుబాబు వెంటాడుతున్నాడు.

చీకటి. మనుషుల లీలామాత్రమైన స్వరూపాలు గోచరిస్తున్నాయంతే. మధుబాబుకు ఎక్కడలేని బలం, వేగం వచ్చాయి. రెండు ఫర్లాంగులు వెళ్ళాక కాలవ సమీపంలో అవతల వాళ్ళలో ఒకడ్ని పట్టుకున్నాడు.

"వొదులు, నన్నొదులు" అని గింజులాడ్తున్నాడు వాడు.

"దుర్మార్గుడా ఆ అమ్మాయి నీకేం అపరాధం చేసిందిరా?" అంటూ దవడ పగిలేటట్లు ఒక్కటి తగిలించాడు మధుబాబు.

కొంచెం ముందుకు పరిగెత్తిన అతని మిత్రుడు పరిస్థితి గమనించి వెనక్కి తిరిగివచ్చాడు.

"విడిచిపెట్టు" అంటున్నాడు మొదటివాడు.

ఎక్కడలేని ఆగ్రహంతో మధుబాబు మరో చెంపకాయ కొట్టాడు.

రెండవవాడు వెనకనించి బలంగా మధుబాబు నెత్తిమీద కొట్టాడు. అతని తల తిరిగింది. శక్తినంతా కూడతీసుకుని వెనక్కి తిరగబోయాడు. కాని అవతలివాడు అదేచోట మరో దెబ్బ దబ్‌మని కొట్టి గట్టిగా అవతలకు తోశాడు. మధుబాబుకు కాళ్ళలో బలం నశించింది. ఆ తాకిడికి తట్టుకోలేక నేలమీద పడిపోయాడు. లేద్దామని ప్రయత్నిస్తున్నాడు. మొదటివాడు తాను చేసే పనేమిటో తెలుసుకోలేని స్థితిలో, క్రిందినుంచి ఓ రాయి తీసి విపరీతమైన కసితో దాంతో అతని తలపై మోదాడు. "అమ్మా" అని ఒక్కసారి మూలిగి తల వాల్చేశాడు మధుబాబు.

యువకులిద్దరూ వెనుదిరిగి చూశారు. కాలేజి ఆవరణనుంచి జనం యిటువేపు గుంపుగా పరిగెత్తుకు రావటం గోచరించింది. గబగబా పరిగెత్తి కాలవలో దూకి, ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు వెళ్ళిపోయారు.

## 9

అంత రాత్రివేళప్పుడు కొడుకు తలనిండా గాయాలతో తీసుకు రాబడటం చూసి సుందరమ్మగారి గుండెలవిసిపోయాయి.

"ఇదేం కర్మరా దేవుడా నిక్షేపంగా కాలేజీకి వెళ్ళిన కుర్రాడికి?" అంటూ ఏడ్చింది.

విశ్వనాధంగారు డాక్టరుకి కబురుచేసి వచ్చి "వీడసలే అర్భకపు సన్నాసికదా. ఆ రౌడీల జోలికి పోకపోతే ఏం చెప్పు? చేతులు కలపటానికి తగిన బలం ఏడిసింది గనుకనా?" అన్నాడు.

మధుబాబు నీరసంగా మంచమ్మీద పడుకున్నాడు. తండ్రి మాటలకు అతనికి దుఃఖం కలిగింది.

"నేనింత బలహీనంగా ఎందుకు పుట్టాను?" అనుకున్నాడు.

తల్లి అతని ప్రక్కలో కూర్చుని గుండెమీద చెయ్యివేసి "ఎంత రక్తం పోయిందో ఏమో? పిల్లాడు డీలా పడిపోయినాడు" అంటోంది.

తనకు పద్దెనిమిదేళ్ళు. తను పిల్లవాడా? అంత నీరసస్థితిలోనూ తాను గ్రీన్‌రూమ్ లో చేసిన పని జ్ఞాపకం వచ్చింది. అది పిల్లవాళ్ళు చేసే పనా? అతనికి రాజ్యలక్ష్మి ఎలావుందో తెలుసుకోవాలని ఆతృత కలిగింది. కాని ఎవర్నడుగుతాడు? అతన్ని దింపి మిగతా విద్యార్థులంతా వెళ్ళిపోయారు.

తలంతా మండుతోంది – గాయాలతో, ఆలోచనలతో.

రెండు రోజులు గడిచాక అతన్ని వెదుక్కుంటూ రాజ్యలక్ష్మి వచ్చింది. ఉదయం పది దాటుతోంది. విశ్వనాథంగారు ఇంట్లో లేరు. సుందరమ్మగారు అప్పుడే వంటపని ముగించుకుని ముందు గదిలోకి వస్తోంది.

రాజ్యలక్ష్మి గుమ్మంలో నిలబడి సిగ్గుపడుతూ "మధుబాబుగార్ని చూడ్డంకోసం వచ్చానండి" అన్నది.

"లోపలకు రామ్మా. నీ పేరు ఏమిటి?"

చెప్పింది.

"అదిగో ఆ గదిలో ఉన్నాడు. తీసుకు వెడతాను రామ్మా. మధూ నీకోసం ఎవరో వచ్చారు చూడు" అని ఆమెను అక్కడ దింపి ఇవతలకు వచ్చేసింది.

"రాజ్యలక్ష్మీ" అన్నాడు మధుబాబు ఆశ్చర్యంగా.

"ఎలావుంది?" అనడిందామె ముఖం మీదకు వొంగి ఆదుర్దాగా.

"ప్రమాదమేం లేదు. వొట్టి నీరసం తప్ప. నాలుగయిదు రోజుల్లో లేచి ఫ్రీగా తిరగగలుగుతాను. ఆ కుర్చీ ఇలా లాక్కో రాజ్యలక్ష్మీ ఏమీ అనుకోకపోతే."

ఆమె కుర్చీని అతనికి సమీపంగా లాక్కుని కూర్చుంది. చాలా మామూలుగా, పరికిణీ, వోణీ వేసుకుని వచ్చింది. ఎండలో నడిచి రావటం వలన ముఖమంతా స్వేదబిందువులు అలుముకుని, కొంచెం వడలి వుంది. ముఖంలో ఏదో

విషాదం తాలూకు జీర్ణ రేఖలు స్ఫుటంగా దృగ్గోచరమౌతున్నాయి. తలనిండా కట్లు కట్టుకుని పడుకున్న ఆ యువకుడిని చూస్తే ఆమెకు విచారం కలిగింది.

"ఎందుకలా చేశారు?" అంది బాధగా.

"ఏం చేశాను?" అన్నాడతను సందిగ్ధంతో సతమతమవుతూ

"రౌడీల జోలికెందుకు పోయారు?"

"దుర్మార్గులు నిన్ను రాయిపెట్టి కొట్టలేదూ? అయ్యో అసలు విషయం మరిచాను. నీకు బాగా దెబ్బతగిలిందా రాజ్యలక్ష్మీ" అంటూ అతను ఆతృతగా ఆమె ముఖంకేసి పరీక్షగా చూశాడు. పాలభాగం మీద ఎడంవైపుగా చిన్న మచ్చ కనిపించింది.

ఆమె నిర్లక్ష్యంగా పెదవి విదిల్చి "కొంచెం కళ్ళు తిరిగాయి అంతే. హాయిగా ఉన్నాను ఇప్పుడు" అంది.

మధుబాబు ఆ నాటి దృశ్యం జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఒక విధంగా ఆమె ముఖం కేసి చూడాలంటే సిగ్గుతో చచ్చిన చావుగా వుంది.

"నేను పాపిష్టిదాన్ని. నా వల్లనే మీకు గాయాలు తగిలాయి. మీకు నయమయ్యే వరకూ సపర్యలు చేస్తూ ఇక్కడే వుండిపోతాను."

ఈ మాటలు అతనికి విచిత్రంగా ధ్వనించి, ఆమె ముఖం కేసి చూశాడు. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. ఇద్దరి పెదాలమీద చిరునగవు అవతరించింది.

"నీ కథలోలాగా" అన్నాడు మధుబాబు.

రాజ్యలక్ష్మి నవ్వాపుకుంది.

"పోదురూ"

మరు క్షణంలో అతని ముఖం మలినపూరితమయిపోయింది. "నన్ను క్షమించు రాజ్యలక్ష్మి ఆ రాత్రి.." అంటూ ఆగిపోయాడు.

ఆమె తలవంచుకుని ఆలోచిస్తోంది. ఎట్లా చెప్పటమా ఈ విషయం అని. అవును గ్రీన్‌రూములో కవిగారు చేసిన పని ఆలోచించదగినదే. తను శిక్షకూడా విధించింది. కాని శిక్ష ముందు. నేరం తర్వాత, బొటన వ్రేలితో నేలను రాస్తూ "ఎట్లా చెప్పను? ఇతనికి ఎట్లా చెప్పను" అనుకుంటోంది.

మధుబాబు భావనా పరంపరలో ఉన్నాడు. బహుశా రాజ్యలక్ష్మి మనసులోనూ ఇదే సమస్య ఉత్పన్నమై వేధిస్తోందేమో? తను ఆమెను ప్రేమించాడా? దాన్ని గురించి ఎంతో లోతుగా, విలువయినదిగా చెబుతారే. తన వరకు వస్తుందా? క్షణికమైన వ్యామోహం తనది. ఈ ఆత్మవంచనతో ఆమె జీవితంలో జొరబడే సామర్ధ్యం, తెగింపు తనకు లేవు. అదీగాక ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే విస్తుపోవటమే కాకుండా నవ్వులపాలు కూడా కావాల్సివస్తుంది. ఒక విధంగా తనింకా జీవితం ప్రాధమిక దశలో వున్నాడు. ఒకవేళ ఆమెను ప్రేమించాననుకుంటే పెళ్ళిచేసుకునే శక్తి తనకుందా? తన మాటలు ఎవరూ ఖాతరు చెయ్యరు, ఆమెను తన తల్లిదండ్రులు ఇష్టపడకపోతే వాళ్ళని ఎదిరించే సాహసం ఉందా?

"ఏడిశావ్ నోరు మూసుకో" అంటాడు తండ్రి. తను రచయిత. లోకానికి ఎలుగెత్తి చాటగలడు. ఇంట్లో తన మాట సాగదు. తన విద్య, అభివృద్ధి వీటన్నిటి ముందూ యీ ప్రేమ భస్మీ భూతమై పోతుంది.

"మీకో విషయం చెబుదామని వొచ్చాను" అంది రాజ్యలక్ష్మి తల వొంచుకుని.

"ఏమిటీ" అన్నట్లు చూశాడు మధుబాబు జాలిగా.

"నన్ను మరిచిపొండి" ఆమె కంఠం జీరపోయింది, నయనాంచలాలనుండి జలజల నీరుకారింది.

"ఏడుస్తున్నావా రాజ్యలక్ష్మి?" అన్నాడు మధుబాబు వ్యాకులపాటుతో.

"ఏం చేసేది ఏడవక? నన్ను మరచిపొండి. అదే నేను కోరేది" అంటూ ఆమె రివ్వున లేచి నిల్చుని "వస్తాను మరి సెలవు" అని అతను పిలుస్తున్నా వినిపించుకోకుండా బయటకు వెళ్ళిపోయింది.

అతను నిశ్చేష్టితంగా చూస్తూ వుండిపోయాడు.

ఓ ఘడియ గడిచాక సుందరమ్మగారు వచ్చి "ఎవర్రా ఆ అమ్మాయి" అనడిగింది.

అతను ఉలికిపడి "మాకు జూనియర్ అమ్మా. ఆ అమ్మాయినే రౌడీలు రాయిపెట్టి కొట్టింది" అన్నాడు.

"పాపం ఈ అమ్మాయినేనా? అప్పుడే వెళ్ళిపోయిందేమి?"

"కాలేజికి టైం అయిందట" అన్నాడు అతను తడుముకోకుండా. తనకు ఆడపిల్లల్తో పరిచయం వున్నట్లు తెలియటం, తన కోసం ఆమె ఇక్కడికి రావటం అతనికి ఆవిడ ముందు చాలా ఇరకాటంగా వుంది.

ఆమె అక్కడ్నించి వెళ్ళిపోయాక ఈ విపరీత పరిణామాన్ని గురించి తలపోస్తూ పడుకున్నాడు. రాజ్యలక్ష్మి తన హృదయంలో మంటరేపిపోయింది. ఆమె అలా అనటానికి కారణమేమయి ఉంటుంది? తను ఆమెని మరిచిపోకపోతే ఏమౌతుంది? తను చేసిన పనిని గర్హించటం, హర్షించటము ఈ రెండూ వొదిలేసి అర్ధంకాని అయోమయస్థితిలో పడేసిపోయింది. చిత్రమైన పిల్ల రాజ్యలక్ష్మి.

మధుబాబుకు బాగా నెమ్మదించాక ఓ రోజు విశ్వనాధంగారు అడిగారు. 'నాకు చెప్పనన్నా చెప్పకుండా నాటకంలో వేషం ఎందుకు వేశావురా?"

ఈ ప్రశ్న తండ్రి నోటినుంచి వెలువడుతుందని అతనికి తెలుసు. ఆ సమయం ఎప్పుడాసన్నమౌతుందోనని భయపడుతూనే ఉన్నాడు.

"తప్పని సరి అయింది నాన్నగారూ" అన్నాడు తల వంచుకుని వినయంగా.

"తప్పని సరి అయితే అయింది. నా పర్మిషన్ ఎందుకు తీసుకోలేదు?"

అతను మెదలకుండా వూరుకున్నాడు.

విశ్వనాధంగారు ఓ ఘడియతాళి ఉపక్రమించాడు. "చూడూ ఈ నాటకాలంటే నాకు ఇష్టంలేదు. వాటిని నేను అసహ్యించుకుంటాను. అదో వ్యసనం. ఆ వ్యసనంలో పడినవాడెవడూ బాగుపడడు, చదువు అంటదు. నువ్వు చదువుకోవాలి, పైకి రావాలి. నువ్వు బిజినెస్‌కి పనికి రావు. ఇవన్నీ జీవితంలో దమ్మిడీ ఎత్తుకూడా ఫలంలేని వ్యాపకాలు. నువ్వు కథలు రాసుకుంటూంటే హర్షించి ఊరుకున్నాను. నాటకంలో వెయ్యటం మాత్రం హర్షించలేను. తెలిసిందా?"

మధుబాబులో వేదన చెలరేగింది.

## 10

పరీక్షలు సమీపిస్తున్నాయి. మధుబాబు శ్రద్ధగా చదవసాగాడు. అతి ప్రయత్నం మీద ఏకాగ్రత అలవర్చుకుంటున్నాడు.

రాజ్యలక్ష్మి అతడ్ని కలవరపరుస్తోంది. చాలాసార్లు ఆమెను విపులంగా అడుగుదామని ప్రయత్నించాడు. కానీ ఆమె అవకాశం ఇవ్వటంలేదు. మామూలుగా, ఏమీ తెలియనట్లుగా మాట్లాడేది. భగీరథ ప్రయత్నం మీద అలా నటిస్తుంది అన్న సత్యం స్ఫురిస్తూనే వుండేది. నవ్వుతూ వుండడానికి వ్యర్థప్రయత్నం చేసేది. దిగులుగా, విరక్తిగా గోచరించేది రాజ్యలక్ష్మి.

ఒకసారి సాయంత్రం "మీకో విషయం చెప్పాలి మధుబాబూ" అన్నది అణుచుకోలేక.

"ఏమిటి రాజ్యలక్ష్మీ? ఏమిటి నీ మనోవేదన?"

"ఇప్పుడు కాదులే మధుబాబూ మీ పరీక్షలు కానివ్వండి. నా గురించి ఆలోచనలతో మనసు పాడుచేసుకోకండి. మీరు ఫస్ట్‌క్లాసులో పాస్ కావాలి. పరీక్షలు రాశాక చెబుతాను. అప్పటిదాకా నన్నేమీ ప్రశ్నించకండి ప్లీజ్" అన్నది.

మధుబాబు ఆమెని విడిచిపెట్టి ఖేదంతో వెళ్ళిపోయాడు.

పరీక్షలు ముగిశాయి. చివరి నెలరోజులూ చాలా శ్రమించి చదివాడు మధుబాబు. నిరంతరం తండ్రి అన్నమాటలే గుండెల్లో ధ్వనిస్తూ వుండేవి. ఓపికను మించి, శక్తినంతా ధారపోసి చదివాడు.

చివరి పేపరు రాసివస్తోంటే గేటు దగ్గర రాజ్యలక్ష్మి పలకరించింది.

"బాగా రాశారా?"

"అనుకుంటున్నాను."

"క్లాస్ వస్తుందా?"

"చెప్పలేను రాజ్యలక్ష్మి. మంచి మార్కులతో పాస్ అవుతానని మాత్రం చెప్పగలను. ఇంకా ప్రాక్టికల్స్ వున్నాయిగా."

ఆమె అటూ యిటూ చూసి కంఠస్వరం చిన్నది చేసి "సాయంత్రం కృష్ణానదీ తీరానికి వస్తారా? పాత రేవు వైపు" అన్నది.

అతనామె కళ్ళలోకి చూస్తూ "తప్పకుండా వస్తాను రాజ్యలక్ష్మి" అన్నాడు. ఆమె చిన్నగా నడిచి వెళ్ళిపోయింది.

సాయంత్రం అయిదయేసరికి బట్టలువేసుకుని తయారై కృష్ణా తీరానికి వెళ్ళాడు. వేసవి ప్రారంభమైంది. కాని నదీతీరం కాబట్టి అక్కడ చల్లగా, హాయిగా వుంది. ఆనకట్ట ప్రక్కనుంచి కార్లూ, బళ్ళూ పోవటం ప్రారంభమైంది. దూరంగా నదీతరంగాలమీద తెరచాప యెత్తి రెండు పడవలు కదిలిపోతున్నాయి. బెస్తవాళ్ళు వలలువేసి చేపలు పట్టుకుంటున్నారు.

ఒడ్డున అక్కడక్కడా ఒకడూ యిద్దరూ తప్ప మనుషులు లేరు. ఒక చాకలి పడుచు మధుబాబు నిల్చున్న ప్రదేశానికి వచ్చి బట్టలు ఉతకసాగింది. నీళ్ళుచింది అతని ముఖాన పడ్డాయి.

ఆమె నాలిక కొరుక్కుని "దూరంగా తొలగండి బాబూ దగ్గరుంటే నీళ్ళు చిందుతయ్" అని అతనికి కోపం రాకుండా వుండేందుకు చిన్నగా నవ్వింది. అతడు దూరంగా జరుగుతూ తలత్రిప్పి చూశాడు.

ఇసుకలో రాజ్యలక్ష్మి నడిచివస్తోంది.

మధుబాబు గుండె గబగబా కొట్టుకుంది. ఏమి చెబుతుంది రాజ్యలక్ష్మి? అట్లాగే చూస్తూ నిలబడ్డాడు.

చిన్న చిన్న అడుగులు వేసుకుంటూ చివరకు రాజ్యలక్ష్మి దగ్గరకు వచ్చి "ఎంతసేపయింది వచ్చి?" అంది కొంచెం నవ్వుతూ.

"కొద్ది నిమిషాలు."

"రండి అలా కూర్చుందాం" అందామె అతనికి చేరువుగా వచ్చి. ఇద్దరూ కలిసి కొంతదూరం నడిచి నీటికి దగ్గరగా యిసుకలో కూర్చున్నారు.

రాజ్యలక్ష్మి ముఖం అలసిపోయినట్లుగా, బలహీనంగా వుంది. ముంగురులు చెదురుగా కళ్ళమీదకు పడుతున్నాయి.

"చెప్పు రాజ్యలక్ష్మి" అన్నాడు మధుబాబు తొందరగా.

వాళ్ళిద్దరూ ఒకరికొకరు చాలా దగ్గరగా వున్నారు. "నన్ను మరిచి పోండి" అన్నది ఆమె దీనంగా ముఖం పెట్టి.

మధుబాబు మనస్సు వికలమైపోఇంది. "ఎందుకని?" అన్నాడు విషాదంగా.

"మన ప్రేమకు పర్యవసానం వుండదు కాబట్టి."

"నువ్వు నన్ను ప్రేమించావా రాజ్యలక్ష్మీ?" అనడిగాడు మధుబాబు హఠాత్తుగా.

ఆమె యీ ప్రశ్నకు అదిరిపడింది. కనుకొలుకుల్లోంచి అతడ్ని చూస్తూ "ఎందుకొచ్చింది మీకా సందేహం ఇప్పుడు?" అంది చిన్నగా.

"ఏముందని.. నాలో ఏముందనీ?" అని గొణిగాడు మధుబాబు అస్పష్టంగా.

"అది నాకు తెలియదు మధుబాబూ" అన్నది రాజ్యలక్ష్మి కంపిత స్వరంతో.

"అలా చేసేశారు ఆరోజు. పాపిష్టిదాన్ని, మిమ్మల్ని హింసించాను. ఆ రాత్రంతా ఎంత ఏడ్చాననుకున్నారు? మీ రూపమే, మీ స్మృతే నన్ను ఆక్రమించుకుని వేధించసాగింది. ఆ క్షణమే తెలుసుకున్నాను. మిమ్మల్ని ప్రేమిస్తున్నానని. కానీ సమయం మించిపోయింది మధుబాబూ. బంధితురాల్ని నేను."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments